క్లుప్తంగా

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న జీసీడీవో

బల్లికురవ: కృషి, పట్టుదలతో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సర్వశిక్షా అభియాన్ జీసీడీవో చారులత కోరారు. శుక్రవారం స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మెనూను తనిఖీలో తరగతులవారీగాలు ప్రశ్నలు వేసి సమాధానాలు రావటంతో సంతృప్తి చెందారు. విద్యాలయంలో జూనియర్ కళాశాలకు మంజూరైన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వెనుకబడిన బాలికలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రిన్సిపాల్ కె. సరళ కుమారి ఉపాధ్యాయినులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మేదరమెట్లలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు శుక్రవారం నిర్వహించారు. దైవాలరావూరు రోడ్డులో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే గ్రామంలో నిర్మించనున్న డ్రైనేజీలు.. కల్వర్ట్‌లకు శంకుస్థాపనలు, గ్రామంలోని సింథైట్ కారం ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలో నిర్మించే కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఫ్యాక్టరీ నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

సివిల్ సప్లయిస్ గోడౌన్ల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్ జైన్

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ నీలకంఠా పురంలో గల సివిల్ సప్లయిస్ గోడౌన్లను జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లు నిల్వ ఉన్న రికార్డులను పరిశీలించారు. రేషన్ బియ్యం, కందిపప్పు, పంచదార స్టాకు రిజిస్టర్‌లో నమోదైన స్టాకును పరిశీలించారు. డీఎస్‌ఓ విలియమ్స్, గోడౌన్ డీటీ శ్రీనివాసరావు, చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

అర్జీల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు.

హైదరాబాద్ తరలిరండి



కొప్పరపాలెంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

బల్లికురవ: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన లక్ష డప్పులు, వేల గొంతులు సభ జయప్రదం చేసేందుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కందుకూరి పేతురు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం కొప్పరపాలెం గ్రామంలో సభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక నేతలు గొర్రెపాటి చిన్న, ప్రశాంత్, కోటేశ్వరరావు, కంభంపాటి యాకోబు పాల్గొన్నారు.

పదింతల నిర్లక్ష్యం

- జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు అందని స్టడీ మెటీరియల్
- దాతల సాయంతో పంపిణీ చేస్తున్న వైనం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందజేత



అక్కాయిపాలెం హైస్కూల్‌లో దాతలు సమకూర్చిన మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసినా వారికి అవసరమైన మెటీరియల్ మాత్రం పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో సకాలంలో విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ దాని గురించి ఆలోచించలేదు. దీంతో పలుచోట్ల దాతల సహకారంతో విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు.

18,133 మంది రెగ్యులర్ విద్యార్థులు

ఈ ఏడాది జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో పదోతరగతిలో 18,133 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉండగా ప్రైవేట్ విద్యార్థులు 396 మంది ఉన్నారు. ప్రైవేట్ పాఠశాలలు 126 ఉన్నాయి. పరీక్ష కేంద్రాలు 103 ఏర్పాటు చేయనున్నారు. వీరంతా పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

మిగిలింది 40 రోజులే..

మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలు రాయడానికి విద్యార్థులకు 43 రోజులు మాత్రమే మిగిలాయి. అయితే మెరుగైన ఫలితాల సాధన దిశగా వంద రోజుల ప్రణాళిక సిద్ధం చేశామని.. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి మడెమ తిప్పింది. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పరీక్షలకు రెండు, మూడు నెలల ముందే విద్యాజ్యోతి పేరుతో ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి పంపిణీ చేసింది.

దాతల చేయూత

దాతల ద్వారా సేకరించిన స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేయిస్తున్నారు. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అసైన్‌మెంట్స్, మాక్ టెస్టులు పెడుతూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకు.. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున వారంలో 5 సబ్జెక్టులకు బోధన అందించి రివ్యూ చేస్తున్నారు.

> **మెటీరియల్ పుస్తకాలు రాలేదు**
>
> 
>
> విద్యాశాఖ ఉన్నత అధికారులు ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు వాట్సాప్ ద్వారా స్టడీ మెటీరియల్ పంపించారు. సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయులకు పంపిస్తున్నాం. అవసరమైన వారు వాటిని ప్రింట్ తీసుకొని బోధిస్తున్నారు. ఈ ఏడాది మెటీరియల్‌కి సంబంధించిన పుస్తకాలు రాలేదు.
>
> – పురుషోత్తం, ఎంఈఓ, వేటపాలెం

బాలకార్మికులుగా మారిస్తే కఠిన చర్యలు



వల్లాపల్లి వద్ద కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్

బల్లికురవ: బాలబాలికలంతా పాఠశాలల్లోనే ఉండాలని వారిని బాలకార్మికులుగా మారిస్తే కేసుల నమోదుతో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవినాయక్ హెచ్చరించారు. శుక్రవారం వల్లాపల్లి సమీపంలో బాలురతో బాతులను కాయించటంతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. డీటీ ప్రహర్ష, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహరరెడ్డి ఉన్నారు.

ముగిసిన డ్రాయింగ్ శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

అద్దంకి రూరల్: ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వర్ణికా పెయింటింగ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పెయింట్‌లో శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణలో ప్రతిభ నబర్చిన విద్యార్థులకు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ హనుమంతరావు బహుమతులు అందజేశారు. శిక్షణలో పాల్గొన్న 70 మందికి మెమెంటోలు అందజేశారు.

వర్ణికా ఫైన్ ఆర్ట్ అకాడమీ డైరెక్టర్ కత్తి బాలకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరం

బల్లికురవ: వైద్యవసతి లేని మారుమూల గ్రామాల్లో సైతం పశుగణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఉచిత పశువైద్య శిబిరాల ఏర్పాటుతో చేయూతనిస్తున్నట్లు వైద్యాధికారులు పి. మహేశ్వరరావు, ఆర్. పావని కుమారి తెలిపారు. శుక్రవారం ఉప్పుమాగులూరులో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

ఇంకొల్లు మండల బీజేపీ అధ్యక్షురాలిగా సాహితి

ఇంకొల్లు (చినగంజాం): మండల బీజేపీ అధ్యక్షురాలిగా కంభంపాటి సాహితి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జిల్లా ఆర్‌ఓ ఎడ్లపాటి స్వరూపరాణి తెలియజేశారు. బీజేపీ అధ్యక్షుడుగా వెనిగండ్ల వెంకటేశ్వర్లు పదవీ కాలం ముగియడంతో ఇంకొల్లు బీజేపీ కార్యాలయంలో అధ్యక్ష ఎన్నికపై సమావేశం నిర్వహించారు. జిల్లా ఏఆర్‌ఓ రాంపల్లి జగన్నాథ శాస్త్రి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

అద్దంకి రూరల్: అద్దంకి సౌత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం దక్షిణ అద్దంకి, నాగులపాడు, వేలమూరిపాడు, జార్లపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈమేరకు ఏఈ ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

చీరాల: స్థలం విషయంలో మహిళపై వ్యక్తి దాడి చేయడంతో ఈపూరుపాలెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈపూరుపాలెంకు చెందిన పద్మ, సురేష్ మధ్య తలెత్తిన స్థలం వివాదంలో సురేష్ పద్మపై దాడి చేసి గాయపరిచాడు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయండి



అర్జీలు స్వీకరిస్తున్న రామారావు

అద్దంకి రూరల్: పోలవరం నదీగర్భంలో మునిగిపోయే నిర్వాసితుల గోడు పట్టించుకునేవారు లేరని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు ఆవేదన వ్యక్తం చేశారు.

జనవరి 29 న పోలవరంలో ప్రారంభమైన ప్రచార జాత శుక్రవారం అద్దంకికి చేరుకున్నారు. స్థానిక భవాని సెంటర్‌నుంచి బస్టాండ్ సెంటర్‌వరకు ర్యాలీ నిర్వహించారు. మోంద్రు ఆంజనేయులు, తంగిరాలవెంకటేశ్వర్లు, సీహెచ్ ముజుందార్, కె. రఘుచంద్, పి. రఘుచంద్ పి. ఆదాము, రావులపల్లి కోటేశ్వరరావు, గంగాధర్, శేఖర్, కేవీ శ్రీను, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జయరావు సేవలు అభినందనీయం



జయరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం: ఉపాధ్యాయ వృత్తిలో 34 ఏళ్ల పాటు ఉత్తమ బోధన అందించిన మాగులూరి జయరావు సేవలు అభినందనీయమని ఎంఈఓ జేవీ సుబ్బయ్య కొనియాడారు. అక్కాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడుగా పనిచేసి.. పదవీ విరమణ చేస్తున్న జయరావును సహఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం బవనం భద్రిరెడ్డి, కె. రత్నప్రభ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీనివా సరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రమణ్యం, ఖరున్నీసా బేగం, వాణి వెంకట రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఎస్తేరమ్మ

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపాలిటీ సాధారణ సమావేశం స్థానిక కౌన్సిల్ హాలులో శుక్రవారం చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ ఆధ్వర్యంలో జరిగింది. తొలుత 34 అభివృద్ధి పనులతో ఉన్న అజెండాను మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్‌రావు చదివి సభ్యులకు వినిపించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. తాగునీటికి రూ. 5 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు అంచనాలను తయారు చేశారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రజక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

మార్టూరు: రజక వృత్తి దారుల సంఘం జిల్లా క్యాలెండర్‌ను శుక్రవారం మార్టూరులో నాయకులు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పి. కొండయ్య మాట్లాడుతూ ఎన్ని జీవోలు.. ఎన్ని చట్టాలు వచ్చినా రజకులపై అత్యాచారాలు, దాడులు ఆగటం లేదనిదని రక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలాగే రజకులకు ప్రత్యేక చట్టం చేయాలన్నారు. రజకుల చెరువులను పెత్తందారులు కబ్జా చేసి దౌర్జన్యం చేస్తున్నారని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. సింగయ్య క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ద్రోణాదుల వెంకట్రావు, ద్రోణాదుల శ్రీను సాంబయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా సర్వేకు హాజరు కావాలి



మోటుపల్లిలో రీ సర్వే పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు



భూములకు రీసర్వే చేస్తున్న మండల సర్వేయర్ బ్రాహ్మణయ్య, సిబ్బంది

చినగంజాం: భూముల రీ సర్వేలో రైతులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి టి. చంద్రశేఖర్ నాయుడు సూచించారు. శుక్రవారం మండలంలోని మోటుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించే నిమిత్తం విచ్చేశారు. సర్వే టీం సభ్యులతో సమావేశమై వాన్‌పిక్, ఫారెస్ట్, ఎండోమెంట్ అన్ని శాఖల వారికి సమాచారం తెలియజేసి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాల్సిందిగా సూచించారు. తహసీల్దార్ జె. ప్రభాకరరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ జీవీ ముసలయ్య, రీ సర్వే డీటీ కె. సుజాత పాల్గొన్నారు.

చీరాల టౌన్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకే రీ సర్వే చేస్తున్నామని మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య తెలిపారు. భూముల రీ సర్వేతో ప్రజలకు ఎనలేని మేలు జరగడంతో పాటు భావితరాలకు భూ సమస్యలు లేకుండా ఉంటాయన్నారు. శుక్రవారం చీరాల నగర్ పంచాయతీలో పసర్వే చేశారు. పాస్ పుస్తకాలు, 1బి అంగళ్, భూమి హక్కుల పత్రాలతో వచ్చి రీసర్వే చేయించుకోవాలని సూచించారు.

వైభవంగా అష్టలక్ష్మి దేవాలయ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాల్లో సచ్చిదానంద స్వామి, విజయానంద స్వామి



ప్రతిష్ఠా కార్యక్రమానికి హాజరైన భక్తులు



అష్టలక్ష్మీ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పర్చూరు(చినగంజాం): పర్చూరులో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. నూతనంగా నిర్మాణం చేసిన ఆలయాన్ని పచ్చని తోరణాలతో, పూలమాలలతో, విద్యుద్దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. యాగశాలలో ప్రత్యేక హోమాలు, క్రతువులు నిర్వహించారు. శ్రీ దత్త పీఠాధిపతులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, శ్రీదత్త విజయానంద తీర్థ స్వామి వార్లు పూజలు నిర్వహించారు. తొక్కిసలాట, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ఆత్మార్పణ దినోత్సవం



పర్చూరులో ఆత్మార్పణ దినోత్సవంలో భక్తులు



మార్టూరు వీధుల్లో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

పర్చూరు(చినగంజాం): పర్చూరులో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షులు మామిడిపాక హరిప్రసాద్, కొల్లా బుల్లిబాబు, అడపాల కృష్ణ, ఊటుకూరు నిర్మల, కొత్తూరు సునీత తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులలో...

స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరంలో ప్రత్యేక హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. ఇంకొల్లు, ఇడుపులపాడు గ్రామాల్లో వేద మంత్రాల నడుమ శాంతి హోమ కార్యక్రమాలను నిర్వహించారు.



ఇంకొల్లులో ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

యద్దనపూడి: ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పూనూరు గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, క్షీరాభిషేకం నిర్వహించారు.

చీరాల అర్బన్: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక సంతబజారులోని అమ్మవారి దేవాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేషవస్త్రాన్ని అందించారు. పేరాలలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

మార్టూరు: ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మర్పణ దినోత్సవాన్ని మార్టూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి పూర్ణ కుంభం తో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పౌరహక్కుల పరిరక్షణ అవసరం



యద్దనపూడి: పౌరహక్కులపై మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

యద్దనపూడి: ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం పౌరహక్కులు కల్పించిందని.. వాటిని ప్రతి పౌరుడు తెలుసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని జాగర్లమూడి ఎస్సీ కాలనీలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పౌరుడికి సమానత్వం , స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. బీద, ధనిక అనే తేడా లేదన్నారు. డిప్యూటీ తహసీల్దారు యద్దనపూడి మస్తాన్‌రావు మాట్లాడుతూ న్యాయం, ధర్మం, స్వేచ్ఛ అవకాశాలు, అభ్యున్నతి అనేది కేవలం కొన్ని వర్గాలకే వర్తించకుండా అందరికీ అందాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చినగంజాం: పౌర హక్కుల గురించి ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చినగంజాం పంచాయతీ మహాలక్ష్మీ కాలనీలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. పౌర హక్కులను సంరక్షించేందుకు పోలీసులు, అధికారులు, న్యాయస్థానాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీటీ కె. సుజాత, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.